ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు


ఓ వైపు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి.. కానీ ఆ స్ఫూర్తి అటు ప్రజల్లో కానీ ఇటు అధికార యంత్రాంగంలో కానీ కనిపించడం లేదనేదానికి ఈ చెత్త కుప్పలే నిదర్శనం..ఇవేవో మారుమూల గ్రామాల్లో నిండిపోయినవి కావు.. అమలాపురం పట్టణంలో అదీ కలెక్టరేట్‌కు దగ్గర్లో.. ఈ చెత్త కుప్పలు నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తున్నాయి..

స్వచ్ఛత నహీ

అమలాపురం నల్లవంతెన వద్ద చెత్తతో నిండిపోయిన శ్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్డు



చెత్తతో నిండిపోయిన ఈదరపల్లికి వెళ్లే బైపాస్ రోడ్డు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: దేశమంతా స్వచ్ఛత హీ సేవలో భాగంగా శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడ చెత్త కుప్ప కనిపించినా ఒక ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు గంటల వ్యవధిలో ఆ గుట్టలు మాయం అయ్యే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తామని చెబుతోంది.. కానీ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో నల్లవంతెన సమీపంలోని రోడ్డు చెత్త కుప్పలతో నిండిపోవడం గమనార్హం. శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డును చూస్తే ముక్కున వేలేసుకోవడం కాదు.. ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. నల్లవంతెన నుంచి ఈదరపల్లికి వెళ్లే బైపాస్ రోడ్డుకు ఇరువైపులా మృత కళేబరాలతో పాటు చెత్తాచెదారంతో నిండిపోయింది. వాహనదారులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక శ్మశాన వాటికను ఆనుకుని అమలాపురం పట్టణ డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తనంతా డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ శ్మశాన వాటికకు వెళ్లే సీసీ రోడ్డు పొడవునా ట్రాక్టర్లతో చెత్తను దింపేసి రోడ్డును మూసేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణంలో ఎక్కడైనా, ఎవరైనా చనిపోతే కనీసం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించే పరిస్థితి లేకుండా చేసేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అన్న క్యాంటీన్

నేడు ముమ్మిడివరంలో ప్రారంభం

ముమ్మిడివరం, సెప్టెంబరు 18: ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీనును గురువారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించనున్నారు. పేదలకు రూ.5 వంతున ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందించే సంకల్పంతో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్లను అనంతరం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తున్న సంగతి తెలిసిందే.. ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్ భవనాన్ని రూ.7 లక్షల 50 వేలతో ఆధునికీకరించారు. ఉదయం 350 మందికి, సాయంత్రం 200 మందికి ఆహారాన్ని అందించే ఏర్పాట్లు చేశారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా పేదలకు ఈ ఆహారాన్ని అందించే ఏర్పాట్లు చేశారు. అన్న క్యాంటీను భవనంలో ఆహార పదార్థాలు తీసుకునేందుకు విశాలమైన కౌంటరు, ఎనిమిది ఫ్యాన్లు, భోజనం చేసేందుకు ఏడు స్టాండింగ్ టేబుళ్లు, బాత్‌రూమ్, వాష్ బేసిన్, మంచినీటి సదుపాయం, చెత్త వేసేందుకు డస్ట్‌బిన్లు, ఒక కంప్యూటర్ ఏర్పాటు చేశారు.


అన్న క్యాంటీన్ లోపల ఏర్పాట్లు



ఎలుకకు ₹80

ఎలుక చూడ్డానికి చిన్న ప్రాణే.. కానీ అది చేసే విధ్వంసం అంతాఇంతా కాదు. ముఖ్యంగా రైతులకు ఎలుక చేసే చేటు మాటల్లో వర్ణించలేనిది.. ఎలక్కొట్టుడు కారణంగా దిగుబడి దారుణంగా దెబ్బతింటుంది. దీంతో ఎలుకల బెడదను వదిలించుకునేందుకు రైతులు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తుంటారు. చేతి చమురు వదిలించుకునైనా ఎలుక బరువు దించుకుంటారు. ఒక ఎలుకను పట్టుకోవడానికి 80 రూపాయలు ఖర్చు పెడుతున్నారంటే అవి రైతులను ఎంత ఇబ్బంది పెడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు..

ఎలుకల బెడదతో రైతుల తంటాలు

ఎంత రేటైనా ఇచ్చి పట్టిస్తున్న వైనం

ఒక్కో ఎలుకకు రూ.80 ఫిక్స్

ఎలుకల కారణంగా ఎకరాకు మూడు నుంచి ఐదు బస్తాల వరకూ దిగుబడి తగ్గిపోతుంది. ప్రస్తుతం వరి పొలాలు ఏపుగా పెరిగి ఉన్నాయి. ఈ దశలో ఎలుక కొట్టుడు తీవ్రంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఏపుగా పెరుగుతున్న వరి పైరును ఇష్టమొచ్చిన రీతిలో ఎలుకలు కొరికివేసి నష్టం చేస్తున్నాయి. పెద్దపెద్ద గట్లు ఉన్న పొలాల్లో అయితే ఎకరాకు 10 సెంట్లు నుంచి 30 సెంట్లు పొలం వరకూ కొరికి పారేస్తున్నాయి. ఈ నష్టం నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఎలుకలు బుట్టలు వేయించడం, పొగ యంత్రాలు ఉపయోగించి పట్టుకోవడం వంటివి చేస్తున్నారు. ప్రస్తుతం ఎలుకలు పట్టుకునే వారికి డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో వారు గిరాకీ పెంచేశారు. ఎలుకను పట్టుకోవడానికి రూ.80 వరకూ డిమాండ్ చేస్తున్నారు. రైతులు అడిగినంత సొమ్ము చెల్లించి ఎలుకలను పట్టిస్తున్నారు. దీని వల్ల రైతుకు ఎకరాకు రూ.2 నుంచి 4 వేలు వరకూ అదనపు పెట్టుబడి అవుతుందని వాపోతున్నారు. ● (కె.గంగవరం)




బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

రేషన్ బియ్యం సీజ్

రావులపాలెం, సెప్టెంబరు 18: మండలంలోని రావులపాడులో విజిలెన్స్ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వివరాల ప్రకారం రావులపాడులోని వెలగల దుర్గారెడ్డికి చెందిన ఖాళీ స్థలంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, విజయకుమార్, వీరబాబు, ఆలీషా అక్కడికి చేరుకుని అక్రమంగా నిల్వ ఉంచిన 2123 కిలోల పీడీఎస్ బియ్యాన్ని మూడు మోటార్‌సైకిళ్లు, ఒక తూకం యంత్రం సీజ్ చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.9,79,658గా నిర్ధారించారు. అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సిఫార్సు చేశామన్నారు. నాగవరపు సత్యరామవిశ్వేశ్వరరావు, కానూరి వీరవెంకయ్య, మేడపాటి శ్రీనివాసరెడ్డిలతో పాటు రేషన్ బియ్యం కొనుగోలు చేసిన కర్రి రామిరెడ్డిపై కేసులు నమోదు చేశామన్నారు.

స్మార్క్ సమావేశాలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: దక్షిణ భారతదేశ వైద్య విద్యార్థుల వార్షిక ప్రయోగాత్మక అవగాహన సమ్మేళనం (స్మార్క్) సమావేశాలు ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు కిమ్స్ వైద్య కళాశాలలో జరుగుతాయని డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య తెలిపారు. వైద్య విద్యార్థుల విజ్ఞాన అభివృద్ధికి, ప్రయోగాత్మక కార్యక్రమాల నిర్వహణ, పరిశోధనా పత్రాలు, పోస్టర్ ప్రజెంటేషన్ల ద్వారా అనేక అంశాలు తెలుసుకోవడానికి నేర్చుకోవడానికి ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు శిక్షణా తరగతులతో పాటు వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. రీసెర్చ్ పేపరు, పోస్టర్ ప్రజెంటేషన్లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. దక్షిణ భారతదేశంలోని వైద్య కళాశాలల నుంచి సుమారు వెయ్యిమందికి పైగా వైద్య విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

కొరడా ఝుళిపించిన కూటమి సర్కారు

పోలవరం భూసేకరణ పరిహారంలో

రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులు గుర్తింపు

సొమ్ము మొత్తం వసూలు చేయాలని రంప

చోడవరం సబ్ కలెక్టరుకు ఆదేశం

7

కోలుకుంటున్న క్షతగాత్రులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: రావులచెరువు విస్ఫోటం కేసులో తీవ్రంగా గాయపడ్డ గొవ్వాల నాగేశ్వరరావు-నాగలక్ష్మి దంపతులతో పాటు కుమారుడు యల్లీష్‌రాజు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. నాగలక్ష్మికి ఆపరేషన్ నిర్వహించడం వల్ల కొద్దిగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గాయపడ్డ బాధితులను కిమ్స్ ఆసుపత్రిలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జనసేన మండలశాఖ అధ్యక్షుడు లింగోలు పండు తదితరులు పరామర్శించారు.

లైంగిక వేధింపులపై నిర్లక్ష్యం

గిరిజన సంక్షేమ శాఖపై విమర్శలు

వార్త..7లో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పక్కన జేసీ

రైల్వే లైన్ అలైన్‌మెంట్ ప్రకారం క్షేత్రస్థాయి సర్వే చేయాలి

వేటిని తొలగించాల్సి వస్తుందో నివేదిక ఇవ్వాలి

మండలాల వారీగా డివిజన్ స్థాయిలో మ్యాపులను సిద్ధం చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ ప్రకారం క్షేత్రస్థాయిలో సంపూర్ణ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సర్వేచేసే గ్రామాలు, మండలాల వారీగా డివిజన్ స్థాయిలో మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. సర్వేలో భాగంగా ఏయే శాఖలకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్‌లో ఉన్న గ్యాస్ పైపులైన్లు, రహదారులు, ఇల్లు, భవనాలు వంటివి తొలగించాల్సి వస్తుందో పూర్తి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, ఆర్డీవోలతో బుధవారం కలెక్టరేట్‌లో రైల్వేలైన్ అలైన్‌మెంట్ ప్రకారం ప్రాథమికంగా నిర్వహించిన తొలి సర్వే నివేదికపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చర్చించారు. రైల్వేలైన్ ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న వాటి వివరాలను సర్వే నంబర్ల వారీగా నివేదించాలన్నారు. భవన నిర్మాణాలు ఎప్పుడు జరిగాయి, వాటి నిర్మాణ విలువ వంటి అంశాలను క్షుణ్ణంగా నివేదిక రూపొందించాలన్నారు. మరోసారి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో చర్చించి ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలు అందజేస్తామన్నారు. అమలాపురం రూరల్ మండలంలో భట్నవిల్లి, కామనగరువు, ఇమ్మిడివరప్పాడు, పేరూరు, రోళ్లపాలెం, చిందాడగరువు, అల్లవరం మండలం బోడసకుర్రు, మామిడికుదురు మండలం పెదపట్నం, నగరం, గెద్దాడ, రాజోలు మండలం శివకోడు, చింతలపల్లి, పాలగుమ్మి, బి.సావరం, కడలి, శివకోడు, మలికిపురం మండలంలో మట్టపర్రు, గుడిమెళ్లంక గ్రామాలు రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, జేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

538 హెక్టార్లలో ముంపు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా జిల్లాలో 538 హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాంప్రకాష్ సోసోడియా అమరావతి నుంచి బుధవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వరదల కారణంగా ముంపు బారిన పడిన మండలాలు, గ్రామాలు, దెబ్బతిన్న పక్కా గృహాలు, కచ్చా గృహాలు, పశువుల కొట్టాలు, పశునష్టం, పంట నష్టంపై జిల్లాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ వరి పంట 538 హెక్టార్లలో ముంపు బారిన పడిందని, 33 గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఒక పశువుల కొట్టం దెబ్బతిందన్నారు. ఇక 1926 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపు బారిన పడినట్టు వివరించారు. ఐదు గేదెలు, 34 గొర్రెలు, మేకలు భారీ వర్షాలకు మృతిచెందాయన్నారు. 38,148 గృహాలు ముంపునకు గురయ్యాయని ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపారు. వరద సహాయక చర్యల్లో భాగంగా 35,330 కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పాల్గొన్నారు.



రేలంగి.. స్మరామి

కొత్తపేటలో విగ్రహం తయారీ

నేడు రాజమహేంద్రవరంలో ఆవిష్కరణ

కొత్తపేట, సెప్టెంబరు 18: ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య నిలువెత్తు 8 అడుగుల కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్ రూపొందించారు. రాజమహేంద్రవరం గోదావరి గట్టున బాపు రమణల విగ్రహాల చెంతన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కొత్తపేటలో రూపొందించిన రేలంగి విగ్రహాన్ని రాజమహేంద్రవరం పంపినట్లు శిల్పి రాజకుమార్ వడయార్ తెలిపారు.

నేడు, రేపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో

ప్రత్యేక మహిళా జైలు సందర్శన

వార్త..7లో

కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు


పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: జిల్లాలో కౌలుదారులందరికీ రుణ అర్హత కార్డులు పారదర్శకంగా జారీ చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జీవో నంబరు 596 ప్రకారం నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రుణ అర్హత కార్డులు జారీ చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి ఇ-పంట నమోదు రైత్వారీ ఈకేవైసీ నమోదు సామాజిక తనిఖీ నిర్వహణ, పీఏసీఎస్‌ల రికార్డుల కంప్యూటరైజేషన్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జీవోను అనుసరించి ఈ నెల 25 నాటికి రుణ అర్హత కార్డుల జాబితాల నివేదిక సమర్పించాలన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సూచనల మేరకు ఆక్వా చెరువులకు అనుమతి ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కనీసం ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రికార్డుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రాల్లో వర్షపాతం రీడింగ్ నమోదయ్యే పరికరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల డేటా కంప్యూటరీకరణ అక్టోబరు 2 నాటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. ఈ-పంటలో భాగంగా ఈ-ఫిష్ చెరువుల విస్తీర్ణం నమోదు కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో ఎటువంటి ఇసుక తవ్వకాలు, ఇసుక విక్రయాలు నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. అక్టోబరు 15 నుంచి పూర్తిస్థాయిలో రీచ్‌లలో ఇసుక లభిస్తుందని స్పష్టం చేశారు. పొలం పిలుస్తుంది వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యానవన అధికారి బీవీ రమణ, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జేవీవీ సత్యనారాయణ, జి.కేశవర్ధనరెడ్డి, ఆయా శాఖల మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.



కూటమి సర్కారు కొరడా

- పోలవరం భూసేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులు గుర్తింపు
- బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సొమ్ము మొత్తం వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరుకు ఆదేశం

పోలవరం జాతీయ ప్రాజెక్టు కింద చేపట్టిన భూసేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలకు కొరడా ఝుళిపించింది. ఈ బాగోతాలకు సంబంధించి బుధవారం జీవో నెం.629, 631గా రెవెన్యూ (విజిలెన్స్) విభాగం ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం భూ సేకరణ, పునరావాస అక్రమాలపై గడచిన ఐదేళ్లలో 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే.

రంపచోడవరం, సెప్టెంబరు 18: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీలో భూములకు సంబంధించి 2019 జూలై నుంచి 2022 ఫిబ్రవరి వరకు 27 మంది అనర్హులైన గిరిజనేతర రైతులకు అప్పటి స్పెషల్ కలెక్టరు ఇ.మురళి, రాజమహేంద్రవరంలోని ఎడమ కాలువ యూనిట్-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (ఇన్‌చార్జిగా ఉన్న) చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి రూ.19.52 కోట్ల మేర దఫదఫాలుగా చెల్లింపులు సాగించేశారు. ఈ అక్రమ బాగోతంపై కొన్నేళ్లుగా ఫిర్యాదులు అంది, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నుంచి నివేదికలు అంది, సంబంధిత అధికారుల నుంచి బాధ్యులపై తగు చర్యలకు సూచనలు ఉన్నా జగన్ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

కాగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ బాగోతాల ఫైలు కూడా బయటపడింది. దీంతో సదరు అంశాలను నిశితంగా పరిశీలించిన ప్రభుత్వం బాధ్యులపై తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే సదరు ఉత్తర్వులు జారీ చేసింది. దాని ప్రకారం కేవలం ఒక్క కొండమొదలులో మాత్రమే చోటుచేసుకున్న భూసేకరణ అక్రమాలను చూస్తేనే ప్రభుత్వ ఖజానాకు భూ సేకరణ అధికారులు అనర్హులైన రైతులతో కుమ్మక్కయి చేకూర్చిన నష్టాన్ని భర్తీ చేసే చర్యలను కూడా ప్రభుత్వం చేపట్టింది. రెవెన్యూ రికవరీ చట్టం కింద సదరు రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులను ఆయా అధికారుల నుంచి, పరిహారం పొందిన గిరిజనేతర రైతుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది.

ఇదిలా ఉండగా బాధ్యులైన అధికారులుపైన, గిరిజనేత రైతులపైన అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించింది. అయితే ఈ బాగోతంపై ఇప్పటికే అప్పటి అల్లూరి కలెక్టర్ సుమిత్‌గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవీపట్నం పోలీసు స్టేషన్లో క్రైం నెం.70/2022గా కేసు నమోదు కాగా అందులోసదరు అధికారులు, గిరిజనేతర రైతులు ముందస్తు బెయిలు పొందారు. ఇది ఇంకా దర్యాప్తు స్థాయిలోనే మిగిలి పోయింది. అయితే ఇపుడు అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అల్లూరి జిల్లా కలెక్టరును ఆదేశించడంతో ఇప్పటికే నమోదై ఉన్న కేసును ఏసీబీకి బదిలీ చేయడం అనివార్యమవుతోంది. ఈ వ్యవహారమే కాకుండా ఇంకా అనేక అక్రమ వ్యవహారాలు వందల కోట్ల రూపాయల మేర చోటుచేసుకున్న విషయం కూడా ప్రభుత్వ పెద్దల వద్ద పెండింగులో ఉంది. ముఖ్యంగా పోలవరం జాతీయ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వానిది కావడంతో ఇక్కడ జరిగే అక్రమాలు కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ ద్వారా జరిపించాల్సి వస్తుందన్న వాదనలు కూడా అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి.



విజిలెన్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రంప మన్యంలో రూ.వెయ్యి కోట్ల పనులపై

విచారణ జరపండి

విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు రంపచోడవరం ఎమ్మెల్యే వినతి

రంపచోడవరం, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మొత్తంగా సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేర జరిగిన పనుల్లో నాణ్యతా లోపాలు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడం, లబ్ధిదారుల ప్రయోజనాలను దెబ్బతీయడం వంటి అనేక లోపభూయిష్ట అంశాలను ఎత్తిచూపి ఎమ్మెల్యే ఇక్కడి పరిస్థితులను డైరెక్టర్ జనరల్‌కు వివరించారు. ముఖ్యంగా రూ.139.75 కోట్లతో సీసీ రోడ్లు, రూ.135 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు, రూ.36.64 కోట్లతో నాడు-నేడు పనులు.... వీటికి అదనంగా పోలవరం ప్రాజెక్టు కింద దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాల నిర్వాసితులకు పునరావాసం కల్పించని వ్యవహారాలు, పునరావాస కాలనీల నిర్మాణం, రోడ్ల పనులు, భూముల కొనుగోలు తదితర అంశాలను ఎమ్మెల్యే వివరించారు.

నేడు, రేపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఈ నెల 19, 20 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటిస్తారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి కె.విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడబ్ల్యు ఆదేశానుసారం రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పర్యటనలో భాగంగా ఆమె సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా జైలును సందర్శిస్తారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. బాధిత మహిళల ఫిర్యాదులు స్వీకరించడానికి గురువారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు అందుబాటులో ఉంటారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై కసరత్తు

ఇప్పటివరకు 13,782 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా రూప కల్పనకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఈ నెల 3వ తేదీ వరకు 13,782 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం బుధవారం వాటిని కాకినాడ కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్ వాటిని పరిశీలిస్తున్నారు. ఈ నెల 24వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. నవంబరు 6న తుది జాబితా విడుదల చేస్తారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

24 వరకు పొడిగింపు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో గత నెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉంచామన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈవో కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ చూడాలని లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



హత్యకు గురైన గంటా రాజు

వ్యక్తి దారుణ హత్య

కోటనందూరు, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం భీమవరపుకోట శివారు తలుపులమ్మ తల్లి గుడి సమీపంలో బుధవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని శివపురానికి చెందిన గంటా రాజు (35)గా పోలీసులు నిర్ధారించారు. పథకం ప్రకారం హత్య చేసినట్టు భావిస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న గంటా రాజును ఈ ప్రాంతానికి తీసుకువచ్చి మెడపై కత్తితో వేటు వేసి అతి దారుణంగా చంపారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు తుని రూరల్ సీఐ చెన్నకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ పరిశీలించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.



లైంగిక వేధింపులపై

- ఘటన తెలిసి కూడా ఫిర్యాదు చేయని సంక్షేమాధికారి, పాఠశాల నిర్వాహకులు
- బాధిత విద్యార్థి నుంచి అందిన ఫిర్యాదునే కేసుగా నమోదు చేసిన పోలీసులు
- తొలుత పాలనా కారణాలతో హెచ్ఎంకు డిప్యూటేషన్‌తో సరిపెట్టిన వైనం

గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం

రంపచోడవరం, సెప్టెంబరు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఓ ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చే వరకు గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించింది. బాలల లైంగిక వేధింపుల ఘటన ఎప్పటికీ వెలుగులోకి రాదనుకున్నారో ఏమో గానీ... తీవ్రంగా తీసుకోని పాఠశాల నిర్వాహకులు, అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి వైఖరి ఏకంగా గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసింది. ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన లైంగిక దాడుల పరంపరపై బాధిత విద్యార్థినులు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. తహసీల్దారుకు, ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు, ఏటీడబ్ల్యువో దృష్టికి చేరినా తీవ్రంగా పరిగణించకుండా కేవలం నోటి మాటతో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సదరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న హెచ్ఎంను అక్కడి నుంచి మార్చితే చాలని సూచించారు. దీంతో ఘటన తీవ్రత తెలియని అధికారులు సదరు కామాంధ ప్రధానోపాధ్యాయుడిని ఈ నెల 12న పాలనా కారణాలతో మాత్రమే డిప్యుటేషన్‌పై మంగంపాడు పంపించారు. అయితే అధికారులు ఊహించని రీతిలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చాయి. ఓ మేజిస్ట్రేట్ దృష్టికి కూడా ఈ అంశం వెళ్లడం, గిరిజన సంఘాలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయని గ్రహించడం వంటి కారణాలతో ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు. ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టరు ఆదేశాలతో సదరు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశారు. ఇంత జరిగాకా కూడా బాధిత విద్యార్థినులకు అండగా నిలిచి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సదరు విద్యాలయంలో కానీ, గిరిజన సంక్షేమ శాఖలో కానీ ఎవరూ ముందుకు రాకపోవడం శోచనీయం. మీడియా కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీసులను పంపారు. విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కానీ, వార్డెన్ కానీ, గిరిజన సంక్షేమాధికారి కానీ ఎటువంటి ఘటనా జరగనట్టే వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధిత విద్యార్థిని నుంచే ఫిర్యాదు తీసుకుని పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఘటనను దాచిపెట్టినందుకు, సకాలంలో ఫిర్యాదు చేయనందుకు విద్యాలయ నిర్వాహకులు, సంక్షేమాధికారులు కూడా పోక్సో చట్టం కింద నిందితులవుతారని ఆదివాసీ సంఘాల నాయకులు చెప్తున్నారు.

విచారణాధికారిగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో విచారణాధికారిగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని నియమించినట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం మీడియాకు తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై జరిగిన ప్రాథమిక విచారణ అనంతరం బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశామన్నారు. గిరిజన విద్యాలయాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతరలెవరి నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగినా ఉపేక్షించేది లేదని ప్రాజెక్టు అధికారి హెచ్చరించారు.



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 18: సీబీఎస్ఈ కబడ్డీ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సీబీఎస్ఈ బోర్డు గద్వాల్‌లో నిర్వహించిన క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ) పోటీల్లో బాలుర విభాగం అండర్-14లో శివాజీ బృందం, అండర్-19లో (ఎం.గణేష్, శివ, సాయిరాం బృందం) ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ లక్ష్మణ్, చిన్నరాజు తదితరులు అభినందించారు.

లక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.4.49 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 18: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవదాయశాఖ తనిఖీ అధికారి (రామచంద్రపురం) ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం తెరిచి లెక్కించారు. గత నెల 28 నుంచి ఈ నెల 18 వరకు రూ.4,49,350 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ప్రసాద్, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం



వివరాలు వెల్లడిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

100 కిలోల గంజాయి స్వాధీనం

చింతూరు, సెప్టెంబరు 18: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్‌రాతీలాల్‌కోలి, ఆకాష్ విలాస్ చవాన్ ఒడిశాలోని కుర్మనూర్‌లో 100 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. చింతూరు మీదుగా మహారాష్ట్రకు కారులో తరలించే యత్నం చేశారు. చింతూరు పోలీసు స్టేషన్ ఎదుట వాహన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. నిందితులతో పాటు 100 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన సిద్దాంతి శ్రీను జగ్గంపేటలోని బంధువుల ఇంటికి మోటారు సైకిలుపై బయల్దేరాడు. మార్గ మధ్యంలో రామవరం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైవే సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వేంకటేశ్వరస్వామికి మూడు కిలోల వెండి కవచం బహూకరణ



అంతర్వేది, సెప్టెంబరు 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీవేంకటేశ్వరస్వామికి సఖినేటిపల్లిపాలేనికి చెందిన దంతులూరి కుమారవరప్రసాద్ వెంకటసత్యనారాయణరాజు, కుటుంబ సభ్యులు మూడు కిలోల 400 గ్రాముల రాళ్లతో రూ.3.50 లక్షలు విలువైన సంపూర్ణ వెండి కవచాన్ని బహూకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ అనంతరం దానిని వేంకటేశ్వరస్వామికి అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ అందించారు.

నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ రెండో సంవత్సరం (లేటరల్ ఎంట్రీ)

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో వివిధ కోర్సుల కోసం రెండో సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాలుగు సంవత్సరాల యూజీ ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థి 3, 4 సెమిస్టర్లలో పరిశోధనతో లేదా 3వ సెమిస్టర్‌లో మాత్రమే కోర్స్ వర్క్, 4వ సెమిస్టర్‌లో ప్రాజెక్టు వర్క్‌తో రెండు సంవత్సరాల పీజీ ప్రోగ్రాంలో 2వ సంవత్సరం/3వ సెమిస్టర్‌లో లేటర్ ప్రవేశానికి అర్హులన్నారు. విశ్వవిద్యాలయంతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ పీజీ కళాశాలల్లో మంజూరైన 20 శాతం సూపర్ న్యూమరరీ సీట్ల విభాగాలు/కళాశాల వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచామన్నారు. ఈ నెల 19నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు సూచించిన నిబంధనలు పాటిస్తూ పీజీ లేటరల్ ఎంట్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

దేవీ ఫిషరీస్‌లో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్

నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: ఫుడ్ ఇండియా-2024 పేరిట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ గురువారం వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా పలు పరిశ్రమలను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సీతానగరంలో దేవీ ఫిషరీస్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసిన కొత్త రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఇది తమ కృషికి లభించిన గుర్తింపు అని కంపెనీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.



ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు

స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 18: వివిధ ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొనడానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు పలు జట్ల ఎంపికలను బుధవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ డీఈవో రమేష్ ప్రారంభించారు. అండర్-17 విభాగంలో ఫుట్‌బాల్ పాటు అండర్-14, 17 విభాగాల్లో జూడో, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్‌తక్రా ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి లంక జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, కె.కుమార్, వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.



ఓ వీధిలో వెలుగుతున్న ఎల్ఈడీ దీపం

గొల్లప్రోలు వీధుల్లో విద్యుత్

వెలుగులు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో 450 ఎల్ఈడీ దీపాల కొనుగోలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 18: అంధకారంలో చిక్కుకున్న కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో ఎట్టకేలకు బుధవారం వీధి దీపాలు వెలిగాయి. పట్టణంలోని వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో లైట్లు కొంతకాలంగా వెలగట్లేదు. రాత్రివేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న సమాచారంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. తక్షణం కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 450 ఎల్ఈడీ లైట్లు కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు చొరవ తీసుకోవడంతో అతి తక్కువ ధరకు (గతంలో కంటే 50శాతానికి తక్కువగా) ఎల్ఈడీ వీధి దీపాలను అందించడంతో పాటు బిగించే ఏర్పాటు చేయడానికి బెస్ట్ ప్రొడక్ట్ నిర్వాహకులు ముందుకు వచ్చారు. మంగళవారం ఎల్ఈడీ వీధి దీపాలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరగా బుధవారం ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను నగర పంచాయతీ కమిషనరు రవికుమార్ ప్రారంభించగా జనసేన నాయకులు పాల్గొన్నారు.



వీధి దీపాల ఏర్పాటును ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనరు రవికుమార్

- గణనాథుల లడ్డూలకు వేలం పాటలు
- ఆలయాల వద్ద అన్నసమారాధనలు
- పలు చోట్ల గణనాథుల నిమజ్జనాలు

వరసిద్ధి వినాయకుడికి వెండి కిరీటం

ఆలమూరు, సెప్టెంబరు 18: ఆలమూరు సిద్ధార్థ కాలనీలోని వరసిద్ధి వినాయకునికి రూ.లక్ష విలువైన వెండి కిరీటం, ఇత్తడి మకరతోరణాన్ని శ్రీవినాయక బ్రిక్స్ అధినేత రావాడ సత్తిబాబు దంపతులు, రావాడ నరేష్ దంపతులు బుధవారం బహూకరించారు. ఆలయంలో పండితులు కాళ్లకూరి సూరిపండు, ద్విభాష్యం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని యానాం బంద్



విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష పార్టీల ప్రతినిధులు

యానాం, సెప్టెంబరు 18: కాంగ్రెస్, వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు యానాంలో బుధవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. పుదుచ్చేరి విద్యుత్‌శాఖ పెంచిన చార్జీలను తగ్గించాలంటూ పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వామపక్షాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. యానాంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్ నేతృత్వంలో నిర్వహించిన బంద్‌లో సీపీఐ, సీపీఎం, వీసీఐ, డీఎంకే తదితర వామపక్ష పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు బంద్ ప్రశాంతంగా జరిగింది. యానాంలో పాఠశాలలు, బ్యాంకులు తదితర సంస్థలను మూసివేశారు. యానాంలో పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. అయితే యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి తనయుడికి చెందిన పెట్రోల్ బంక్ మినహా అన్ని మూసివేశారు. అయితే వీటిని మూసివేసేందుకు వామపక్ష నాయకులు ప్రయత్నం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యానాం ఎస్పీ నేతృత్వంలో సీఐ షణ్ముగం బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యానాం శాఖ అధ్యక్షుడు దినేష్ ఆధ్వ ర్యంలో యానాం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందో ళన చేపట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలని, ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని నినాదాలు చేశారు. సీపీఎం యానాం శాఖ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జీవో నంబరు 115 రద్దు చేసి న్యాయం చేయాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 115ను రద్దుచేసి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలంటూ బుధవారం అమలాపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. స్థానిక నల్లవంతెన వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. 15ఏళ్లు పైబడి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న తమను కాదని ఏఎన్ఎంలకు స్టాఫ్‌నర్సు పోస్టులను కట్టబెట్టడం శోచనీయమని విమర్శించారు. అన్ని అర్హతలు ఉన్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలంటూ ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. నిరసనలో ఎస్.సత్యవతి, పి.దుర్గాభవాని, కె.కామేశ్వరి, ఆర్.శివకుమారి, కె.విజయదుర్గ, అరుణ, బి.శ్రీలక్ష్మి, కె.రజనీ, కె.కుమారి, ఆర్.లోవదేవి, వి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్ సహాయంతో అభివృద్ధి పనులు



గంటిపెదపూడిలో వంతెన నిర్మాణ పనులను బ్యాంక్ ప్రతినిధులకు వివరిస్తున్న పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు

పి.గన్నవరం, సెప్టెంబరు 18: రాష్ట్రం వ్యాప్తంగా ఏసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో చేపట్టిన వంతెనలు, రోడ్లకు సంబంధించి రూ.630కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ సి.వి.సుబ్బారెడ్డి అన్నారు. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు లంకగ్రామాల ప్రజల కోసం నిర్మిస్తున్న వంతెనను స్థానిక అధికారులతో కలిసి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధుల బృందం లీడర్ పవన్‌కార్కి పరిశీలించి అనంతరం మాట్లాడారు. లంక గ్రామాలకు ఇక్కడ వంతెన నిర్మాణం అవసరం ఎంతైనా ఉందన్నారు. వంతెన పనులు బాగా జరుతున్నాయని కితాబు ఇచ్చారు. త్వరితగతిన నిధులు మంజూరయ్యేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానన్నారు. అనంతరం బూరుగులంక నదీపాయ దాటి అవతల ఒడ్డున ఉన్న నాలుగు లంక గ్రామాలను వారు పరిశీలించారు. వరదల సమయంలో లంక గ్రామస్తులు పడే ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంటిపెదపూడిలో ఇప్పటి వరకు జరిగిన వంతెన పనులకు రూ.19.50 కోట్లు నిధులు విడుదల కావాల్సి ఉందని స్థానిక పంచాయతీరాజ్ ప్రాజెక్టు అధికారులు వివరించారు. వారి వెంట ఇన్వెస్ట్‌మెంట్ అసోసియేట్ మహ్మద్‌తోషకూర్ రెహ్మాన్, ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ సి.వి.సుబ్బారెడ్డి, కాకినాడ పీర్ సర్కిల్ ఎస్ఈ మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ ఈఈ అలీముల్ల, సబ్‌డివిజన్ డీఈ అన్యం రాంబాబు పాల్గొన్నారు.

ఇంజనీరింగు కళాశాల విద్యార్థుల ప్రతిభ

కాట్రేనికోన, సెప్టెంబరు 18: నూరంపాలెంలో జరిగిన జాతీయ స్థాయి సాంకేతిక పరిశోధక చర్చా వేదిక వేద-2024 టెక్నికల్ సింపోజియంలో అద్వితీయ ప్రదర్శన చేసి శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగు కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సీఎస్ఈ విద్యార్థులు బి.శశాంక్, ఎస్.బాలాదిత్య కంప్యూటర్ విజన్ ఏఏఎస్ఎల్ డిటెక్షన్ అనే అంశంపై పరిశోధనాత్మక ప్రదర్శనకు నగదు, ప్రశంసాపత్రాలు పొందారు. బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాసకుమార్, సందీప్ పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు





ఉప్పలగుప్తం: కూనవరంలో కర్షకగణపతి లడ్డూతో భక్తులు, యానాం: లడ్డుతో కవల బాబులు, కుమారుడు వెంకటేష్

కె.గంగవరం, సెప్టెంబరు18: కోటిపల్లి గోదావరి నది వద్దకు బుధవారం పలు గ్రామాల నుంచి గణపతి విగ్రహాలను కమిటీ సభ్యులు తీసుకువచ్చి నిమజ్జనాలు చేశారు. పామర్రు ఎస్ఐ కె.జానీబాషా నిమజ్జనం కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. యండగండి రామాలయం, గంగవరం రామాలయం, కోటిపల్లి అగ్నికులక్షత్రియులు నిర్వహించిన గణేష్ ఉత్సవాల పందిళ్ల వద్ద బుధవారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

లడ్డూకు అధిక ధర

ముమ్మిడివరం, సెప్టెంబరు 18: కొత్తలంకలో కాపుల వీధి సెంటర్‌లో గణపతి లడ్డూకు నిర్వహించిన వేలంలో అధిక ధర లభించింది. ఆలయ కమిటీ గణపతికి రెండు లడ్డూలను కానుకగా సమర్పించారు. పెద్ద లడ్డూకు వేలం పాట నిర్వహించగా పోలిశెట్టి పెదకాపు కుమారుడు దుర్గ, పోలిశెట్టి త్రిమూర్తులు కుమారుడు దుర్గ, మెండా వాసులు రూ.57వేలకు కైవలం చేసుకున్నారు. చిన్న లడ్డూను దూడల శివకుమార్ రూ.45,001కు సొంతం చేసుకున్నారు.

ఘనంగా అన్నసమారాధన

అంతర్వేది, సెప్టెంబరు 18: వినాయచవితి మహోత్సవాల్లో భాగంగా అంతర్వేది ఏటిగట్టు వద్ద నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు అధినేత నల్లా సత్యకిరణ్‌కృష్ణప్రసాద్ సౌజన్యంతో అన్నసమారాధన నిర్వహించారు. అంతర్వేది శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి, ధ్యానాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సౌజన్యంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అంతర్వేది చెరువుగట్టు వద్ద శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, గణపతి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని నిమజ్జన కార్యక్రమం ఊరేగింపుతో వైభవంగా జరిగింది. మండలంలో పలు అన్నసమారాధనలతో పాటు వశిష్ట రేవు, సఖినేటిపల్లి తదితర ప్రదేశాల్లో నిమజ్జనాలు జరిగాయి.

ఘనంగా గణేష్ నిమజ్జన వేడుక

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 18: రామచంద్రపురం పట్టణం, మండలంలో బుధవారం గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మేదర్ల సంఘం ఆధ్వర్యంలో గణేష్ శోభాయాత్ర జరిపారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. గోదావరి కాలువలో గణనాథులను నిమజ్జనం చేశారు. యాదవ సంఘం నాయకులు, యువత పాల్గొన్నారు.

రూ.1.57లక్షలు పలికిన కర్షక గణపతి లడ్డూ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు18: కూనవరంలో కర్షక గణపతి నవరాత్రి ఉత్సవాల 80వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారి లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన ఆకుల ఏడుకొండలు, నిమ్మకాయల చిన్నగంగాచలం, ఆకుల రమేష్ బ్రదర్స్, బసవా సింహాద్రి బ్రదర్స్ రూ.1.57లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అన్నసమారాధన జరిగింది.

ఆది గణపతి లడ్డూ వేలం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 18: అంగరలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆది గణపతి లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన లొల్ల వెంకట్రావు స్వామివార్కి సమర్పించిన 16కిలోల లడ్డూను గ్రామానికి చెందిన సుంకర నాగు, యర్రా వెంకన్నబాబులు రూ.4వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పెద్దింశెట్టి సూరిబాబు, కొల్లాటి సురేష్, శనివారపు గోవిందు, చీకట్ల గంగరాజు, పడాల రాంబాబు, పడాల రామకృష్ణ పాల్గొన్నారు.

రూ.1.07లక్షలు పలికిన గణపతి లడ్డూ

పి.గన్నవరం, సెప్టెంబరు18: గంటిపెదపూడిలో శ్రీలక్ష్మీ ఆది గణపతి ఆలయం వద్ద లడ్డును వేలం పాటలో స్థానికుడు పోలిశెట్టి చిన్నసత్యనారాయణ రూ.1,07,000కు దక్కించుకున్నాడు. లంకలగన్నవరం వేమనవారిపాలెం గణపతి మందిరంలో జరిగిన వేలంలో లడ్డును స్థానికుడు వేమన ఫణిబాబు బ్రదర్స్ రూ.12వేలకు దక్కించుకున్నాడు. లంకల గన్నవరంలో శ్రీవిజయబాల గణపతి స్వామి వారిని ఘనంగా ఊరేగించి స్థానిక వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

అంబాజీపేట, సెప్టెంబరు 18: అంబాజీపేట సత్యసాయి నగర్ గణపతి ఆలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. స్వామివారికి అనేక రకాల స్వీట్లతో మహాప్రసాదం అందించారు. పలు గ్రామాల్లో గణనాథుని నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

కనకాలపేట లడ్డూ రూ.1.35లక్షలు

యానాం, సెప్టెంబరు 18: యానాం కనకాలపేట రామాలయం సెంటర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద 100 కిలోల లడ్డును కనకాలపేటలకు చెందిన కవల బాబులు, కుమారుడు వెంకటేష్ రూ.1.35లక్షలకు దక్కించుకున్నారు. ఈసందర్భంగా వారిని కమిటీ ప్రతినిధులు సత్కరించారు. యానాం శివారు మెట్టకురు గణపతినగర్‌లోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులు పలు పూజలు నిర్వహించారు.

వైఎస్ షర్మిలను కలిసిన గోపాలకృష్ణంరాజు

అంతర్వేది, సెప్టెంబరు 18: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిని విజయవాడలోని ఆంధ్ర రత్నభవన్‌లో బుధవారం పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే రోజుల్లో వైఎస్ షర్మిళ హయాంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడి అధికారంలోకి తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో చిలకపాటి శ్రీధర్, జేడీ శీలం, కొప్పుల రాజు, మస్తాన్‌వలీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు

అయినవిల్లి, సెప్టెంబరు 18: అధిక వర్షాలు, వరదల వల్ల గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీలు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో బ్లీచింగ్ చేశారు. బుధవారం అయినవిల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఫాగింగ్, బ్లీచింగ్ చర్యలు చేపట్టారు. సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, కార్యదర్శి కొంకి రామచంద్రరావు పాల్గొన్నారు.

పంచాయతీ రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే వేగుళ్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, సెప్టెంబరు 18: మండపేట నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లో నాలుగేళ్లలో అన్ని రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో ఎక్కువ పనులు చేపట్టడం ద్వారా అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. 2014-19లో గృహ నిర్మాణాలు చేసిన వారికి వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఆ బిల్లులు విడుదల చేస్తుందన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పథకం ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఉండేదని, ఇప్పుడు కొత్త జిల్లా యూనిట్ కావడంతో కొంత నష్టపోయే అవకాశం ఉందన్నారు. దీనిపై జిల్లా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల, తాను ప్రశ్నించినట్టు చెప్పారు. సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలు ప్రస్తావించారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాట నిర్వాహకులపై రౌడీషీట్స్ తెరుస్తాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 18: రామచంద్రపురం సర్కిల్ పరిధిలో కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే వారిపై రౌడీ షీట్స్ తెరుస్తామని సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడిపందాలు, జూదం ఆడితే ఉపేక్షించేది లేదన్నారు. పండుగ సీజన్లలో అశ్లీల నృత్యాలు ఏర్పాటుచేస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పును అమలుచేయకపోవడం శోచనీయం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తీర ప్రాంతంలో అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను తొలగించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్-2022లో ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడాన్ని మానవహక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. ట్రిబ్యునల్ తీర్పును సత్వరం అమలుచేసి అక్రమ ఆక్వా చెరువులను తొలగించాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్జీటీ తీర్పును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడంతో పాటు తీర ప్రాంతంలో వాస్తవ ఉప్పునీటి రొయ్యల సాగు వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆక్వా జోన్‌లో 2020 చట్ట నియమాలకు వ్యతిరేకంగా ఉన్న చెరువులను తొలగించడంతో పాటు నాన్ ఆక్వా జోన్‌లో ఎట్టి పరిస్థితుల్లోను అనుమతులు ఇవ్వరాదన్నారు. శ్మశానాలను సైతం ఆక్రమించి రొయ్యల చెరువు సాగు చేస్తున్న దుస్థితి కోనసీమ జిల్లాలో ఉందన్నారు. తక్షణం ఎన్జీటీ తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ ద్వారా కూడా ఉద్యోగావకాశాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 18: సాంకేతిక విద్య ద్వారా కాకుండా డిగ్రీ కోర్సులు అభ్యసించడం ద్వారా కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నన్నయ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాబులు పేర్కొన్నారు. ముమ్మిడివరం సర్ డాక్టర్ రావేబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్థీ నిర్మిత్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్క రోజు వర్కుషాపు ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చాయిస్ బ్రోకింగ్ లిమిటెడ్ రీజనల్ అధికారి మహ్మద్‌సలీం, కళాశాల ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, కంప్యూటర్ అధ్యాపకుడు పి.ఆనంద్, సీహెచ్ సతీష్, మల్లాది నరసింహం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, సెప్టెంబరు18: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లితో పాటు పుట్టిన బిడ్డ కూడా సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని మండపేట ఐసీడీఎస్ పీవో విష్ణుకుమారి, ఎంపీడీవో నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం పసలపూడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత ప్రగతి రామరెడ్డి వితరణతో గర్భిణులకుచీరలు, గాజులు, డ్రైఫ్రూట్స్ అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, సర్పంచ్ కడలి పద్మావతి, కార్యదర్శి మల్లిడి నారాయణరెడ్డి, కూటమి నాయకులు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమష్టి ఉద్యమ సంఘానికి సహకరించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ఏపీజీఈఏ అడహక్ కమిటీ జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ కోరారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సంఘంగా ఏపీజీఈఏ ప్రత్యేక గుర్తింపును పొందిందని వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అడహక్ కమిటీ అసోసియేట్ అధ్యక్షుడు వీరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా ప్రసాద్, నిమ్మకాయల సాయిరామ్, విజయ్‌కుమార్, కొప్పిశెట్టి వెంకటగణేష్, అల్లాడి మల్లేష్, కోశాధికారి పీఏఎస్ రాజ్‌కుమార్, వివిధ సంఘాల ఉద్యోగులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు.

పురోహితుల పాత్ర కీలకం



అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంతో పురోహితుల పాత్ర కీలకమని తిరుపతి శ్రీనివాస వేద విశ్వవిద్యాలయం డీన్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వరశర్మ అన్నారు. జీవుడు చేసే స్మార్తకర్మలన్నింటికీ వేదాలే మూలమని వివరించారు. అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో బుధవారం ఆపస్తంభ పురోహిత పరిషత్ 24వ వార్షికోత్సవ సభకు యజ్ఞేశ్వర అధ్యక్షత వహించి ప్రసంగించారు. స్మృతులలో చెప్పిన కర్మలను ఆచరింపచేస్తూ సమాజ శ్రేయస్సుకు సహకరించడం కోసమే పురోహిత పరిషత్‌ను స్థాపించామన్నారు. ముఖ్య అతిథిగా గరిమెళ్ల విశ్వనాథం, రాళ్లపల్లి సుబ్రహ్మణ్యశర్మ, రాయప్రోలు శ్రీనివాస్‌ప్రసాద్‌శర్మ, మూల పల్లయ్యశర్మ, ప్రయాగ కిశోర్‌శర్మ, ఆకొండి వెంకటేశ్వరశర్మ హాజరై సందేశమందించారు. వేదస్వస్తి, వేదాశీర్వచనం నిర్వహించారు. వెంకటసుబ్రహ్మణ్యశర్మ, తోపెల్ల కార్తికేయశర్మ ఆధ్వర్యంలో పురోహిత పండితులను ఘనంగా సత్కరించారు. కర్రా వినాయకశర్మ, మరువాడ వెంకన్నతో పాటు 150మంది పురోహిత పండితులను సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు18: వాడపర్రు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు జనసేన నాయకుడు మంచెం బాలకృష్ణ కుర్చీలు అందించారు. సలాది నాగరాజు, మంచెం బుజ్జి, మద్దింశెట్టి ప్రసాద్, చీకట్ల ఏసు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు, సెప్టెంబరు18: క్రమ తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులను నివారించవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి సూచించారు. చింతలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించి పౌష్టికాహారంపై అవగాహనసదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రాగులు, సజ్జలు, జొన్నలు చిరు ధాన్యాలు తీసుకుంటే రక్తహీనత, పౌష్టికాహార లోపాలు తొలగి వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: భలే ఉన్నాడే
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: 35
రమా	: మత్తువదలరా-2
గణపతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏఆర్ఎం

యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

రావులపాలెం, సెప్టెంబరు 18:రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని రైతు సేవా కేంద్రంలో యజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా శిక్షణ సమన్వయ కర్త వై.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వరిలో చేపట్టవల్సిన సమగ్ర పోషణ యజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ మాట్లాడుతూ వరిలో ఆశించే పురుగులు, తెగుళ్ల వాటి యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో మీనా, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, సెప్టెంబరు18: ముమ్మిడివరం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9నుంచి 12గంటల వరకు ముమ్మిడివరం, టౌన్‌ఫీడర్-2, రాణేలంకఫీడర్‌లో ఉన్న అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): పట్టణంలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి ఒంటి గంట వరకు పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ విజయానంద్ తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

యానాం, సెప్టెంబరు18: పుదుచ్చేరి ప్రభుత్వం ఆదిద్రావిడ, షెడ్యూల్ ట్రైబ్ సంక్షేమ శాఖకు సంబంధించి యానాంలోని ఎస్సీఎస్టీ విద్యార్థులు 2024-25 ఏడాదికి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని యానాం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రీమెట్రిక్, అపర్చునిటి కాస్ట్, రిటైన్షన్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఈనెల23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మధుపౌర్ణమి పూజలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 18: అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో మధుపౌర్ణమి వేడుకలను బుధవారం నిర్వహించారు. బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బుద్ధ భగవానుడు మధుపౌర్ణమి రోజులనే ఆర్యవంశ సూత్రాన్ని ప్రవచించారు. బుద్ధ మందిరంలో బుద్ధ వందనం నిర్వహించారు. కార్యక్రమంలో నాగాబత్తుల శ్రీనివాసరావు, కాశి రాంబోధి, గోసంగి ఆనందరావు, కాశి వెంకట్రావు, ములపర్తి సత్యనారాయణ, జల్లి శ్రీను, ఈవీవీ సత్యనారాయణ, పెనుమాల చిట్టిబాబు, దుక్కిపాటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం

రాజోలు, సెప్టెంబరు 18: రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో 1975లో ఆలిండియా యూనివర్శిటీ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గెలు పొందిన క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు పుట్టా రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు మాట్లాడుతూ ఎంతో మంది జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించిన ఘనత రాజోలుకు దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాల్‌బ్యాడ్మింటన్ అంటే గుర్తుకు వచ్చేది రాజోలు ప్రాంతమన్నారు. ఆలిండియా క్రీడాకారుడు, ముంబై బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు ఆదరణ తగ్గుతుందన్నారు. ఆలిండియా క్రీడాకారులు కె.రాంబాబు, పి.హనుమంతరావు, మాగంటి మాధవ్, ఎస్.రాంబాబు, సూరిబాబురాజు, రామగోపాల్ పాల్గొన్నారు.

ఆచూకీ తెలిస్తే సంప్రదించండి

ముమ్మిడివరం, సెప్టెంబరు 18: ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద, గౌతమీ నదీపాయలో మంగళవారం లభ్యమైన మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఉంచినట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. లభ్యమైన ఆధారాల ప్రకారం విజయవాడ రూరల్ మధురానగర్‌కు చెందిన ముద్దన సూర్యనారాయణ (53)గా భావించి బంధువులకు సమాచారం అందించినా ఎవరూ రాలేదన్నారు. ఆచూకీ తెలిసినవారు ముమ్మిడివరం ఎస్ఐ 9440796564ను సంప్రదించాలని ఆయన సూచించారు.

క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 18: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లే విధంగా క్రీడాకారులు సాధన చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎంపీపీ, జడ్పీటీసీ ప్రారంభించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా అండర్-14, 17 షటిల్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, పాఠశాల చైర్మన్ పితాని త్రిమూర్తులు, మండల స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అధికారి అంది సూర్యనారాయణ, నాయకులు కొర్లపాటి గోపి, విత్తనాల శేఖర్, సుదాబత్తుల రాము, కామిశెట్టి మధుబాబు, కొర్లపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

620 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మండపేట, సెప్టెంబరు18: పాలతోడు చిన్నకాలువ సమీపంలో పోలీసులు దాడిచేసి 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన 620 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన కల్లి విజయ్‌కుమార్, కురుపూడి సతీష్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించా మని రూరల్ ఎస్ఐ డి.సురేష్ బాబు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

పసలపూడిలో డీపీవో విచారణ

రాయవరం, సెప్టెంబరు 18: పసలపూడి గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి ఇటీవల స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి డి. రాంబాబు విచారణ చేపట్టారు. రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదుదారుడు తమ్మిరెడ్డి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో ఒక కమిటీని నియమించి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీపీవో చెప్పారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ.లక్ష విరాళం

అమలాపురంరూరల్, సెప్టెంబరు18: శ్రీకోనసీమదేవాంగ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలకు సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ రూ.లక్ష చెక్కును అందజేశారు. సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు జాన బాబ్జి, ఉపాధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, ప్రధాన కార్యదర్శి పుత్సల వరదరాజు, బళ్ల వెంకటేశ్వరరావు బుధవారం రమణను కలవగా చెక్కును అందించారు.

'వక్ఫ్ భస్మాసుర చట్టం వద్దు'

అమలాపురం టౌన్, సెప్టెంబరు18: వక్ఫ్‌భస్మాసుర చట్టం వద్దంటూ సూర్యనగర్‌లో బుధవారం రాత్రి డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దేశంలో ఉంటూ చట్టాలకు అతీతమని పేర్కొనడం శోచనీయమన్నారు. వక్ఫ్‌చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. సూర్యనగర్ నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ సహాయం

ఐ.పోలవరం, సెప్టెంబరు 18: కేశనకుర్రు పంచాయతీ పరిధిలో గోదావరి వరదకు మత్స్యకారులు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం బాధితులకు టార్పాలిన్స్, హైజోనిక్ కిట్స్ అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు, మోకా రవికుమార్, ఎంఎస్ఎన్ రాజు,పెన్మెత్స సుబ్బరాజు, చెల్లి రమాదేవి పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ద్రాక్షారామ, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం మండల స్థాయి క్రీడా పోటీలు కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో బుధవారం ప్రారంభించారు. అండర్ 14,17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్, యోగ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. మండలంలో పలు పాఠశాలల నుంచి 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ అబంటి భవానీ, ఎంఈవో శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ గంగరాజు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

కె.గంగవరం, సెప్టెంబరు 18: పామర్రు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మండల స్థాయి 14-17ఏళ్ల యువకులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, చదరంగం, షటిల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు మెడల్స్ అందజేశారు. విజేతలను నియోజవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు పీడీలు ఏఎస్‌వీసత్యనారాయణ, పి.సురేష్‌బాబు చెప్పారు. పోటీలను ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు ప్రారంభించారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు, ప్రధానోపాధ్యాయులు, కూటమి నాయకులు గుర్రాల సత్యనారాయణ, దేవరపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత కంటి శుక్లాల చికిత్సా శిబిరం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 18: చినకోరుమిల్లిలో సీతారామ కాపు కల్యాణ మండపంలో ఈనెల10న ప్రారంభమైన ఉచిత కంటి శుక్లాల చికిత్సా శిబిరం బుధవారంతో ముగిసింది. కోరుమిల్లి గ్రామస్తులు లంకా విజయ్ మెహర్ చంద దంపతుల ఆర్థిక సహకారంతో పది రోజులు శిబిరం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది చికిత్స పొందారు. సంచార కంటి చికిత్స వాహనంలో నిపుణులైన వైద్యులు అవసరమైన వారికి కంటిపొర ఆపరేషన్లు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. మేజర్ కంటిశస్త్ర చికిత్స అవసరమైన వారిని చెన్నైలో ఉన్న శంకర నేత్రాలయ కంటి వైద్యశాలలో శస్త్ర చికిత్సకు తీసుకువెళ్తామని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు లంకా విజయ్ మెహర్‌చంద్ దంపతులను గ్రామస్తులు సన్మానించారు. వైద్యులను, సిబ్బందిని విజయ్‌మెహర్‌చంద్ దంపతులు సన్మానించారు. శిబిరానికి సహకరించిన కండవిల్లి పెరుమళ్ళ బాబి, శర్మ తదితరులను గ్రామ పెద్దలు వెలుగుబంటి కోనం రాజు, గంగుమళ్ళ కృష్ణ అభినందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 18: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఊబలంకకు చెందిన వెత్సా వెంకటేశ్వరరావు- నాగవరలక్ష్మి దంపతులు రూ.1,00,111 విరాళం సమర్పించారు. దాతలకు ఉపకమిషనరు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వైభవంగా చండీహోమం

ఐ.పోలవరం,సెప్టెంబరు18: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, పూర్ణాహుతి జరిగాయి. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: డీపీవో

రాయవరం, సెప్టెంబరు18: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని డీపీవో డి.రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం డీపీవో పరిసరాల పరిశుభ్రతపై అధికారులతో కలిసి పసలపూడిలో ఇంటింటికి వెళ్లి వివరించారు. ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి నారాయణరెడ్డి, సర్పంచ్ కె.పద్మావతి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, కె.సుధాకరరెడ్డిపాల్గొన్నారు.